# నవీన యూనివర్సల్ స్కూల్

**-అంబల్ల జనార్ధన్**

**"మీ అబ్బాయి స్కూల్ మార్చారటగా!"**

**"అవును వదినా. ఈ సంవత్సరమే మొదలైన అమెరికన్ మేనేజ్‌మెంట్ ద్వారా నడపబడే స్కూల్‌లో వేసాం. వారి పద్ధతులన్నీ నచ్చి మా అబ్బాయిని మూడో తరగతిలో చేర్చాం."**

**"అవునవును. నవీన యూనివర్శిటీ స్కూల్ గురించి టీవీ, పేపర్లలో ప్రకటనలు మేమూ చూసాము. ఆన్‌లైన్ ప్రవేశాలు, భారత సాంప్రదాయం ప్రకారం ఇంగ్లీషు మీడియంలో బోధన, మన తెలుగు భాషకు ప్రాధాన్యత, కంప్యూటర్‌తోపాటు యోగ శిక్షణ... ఇలా వారి ప్రచారంతో జనాలను ఊదరగొట్టారుగా. దానికి మీరూ పడిపోయారన్నమాట."**

**"దాంట్లో తప్పేముంది వదినా. కాన్వెంట్‌లో అన్నీ పాశ్చాత్య పద్ధతులే. క్రమశిక్షణ పేరుతో పిల్లల పీడన, తెలుగులో మాట్లాడితే ఫైన్... ఇలా రకరకాలుగా పిల్లలను హింసించడం మొదలైనవన్నీ భరించలేక ఈ స్కూల్లో చేర్చాం. ఇక్కడ చదువుతోపాటు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు... ఇలా ఎన్నో విశిష్టతలున్నాయి. స్కూలుకు పోయి రావడానికి ఏసీ వోల్వో బస్సులు, అందులో స్కూలు బ్యాగులకు వేరే అర, పిల్లలను కుక్కినట్లు కాకుండా సౌకర్యవంతమైన త్రీటైర్ బెర్తుల్లో సీట్లు. విద్యార్థి పేరు, క్లాసు, డివిజన్, బెంచి రోల్ నెంబర్ వగైరాలతో ప్రతి స్కూలు బ్యాగుకూ ట్యాగు. ఆ బ్యాగులు క్లాసునుంచి బస్సులోకి మోయడానికి అదనపు సిబ్బంది. యూనిఫారం కూడా వినూత్నంగా ఉంటుంది. మగపిల్లలకు తెల్లపంచా, చొక్కా, నడుముకు కాషాయరంగు బెల్టు, ఆడపిల్లలకు తెల్ల పరికిణీపై, నడుముకు కాషాయ రంగు బెల్టు. ఆ పిల్లలను చూస్తే ఎంత ముద్దొస్తారో?"**

"అక్కడ టిఫిన్ బాక్స్, వాటర్ బాటిల్ నిషిద్ధమట. స్కూలు బస్సే వాడాలి తప్ప కార్లో పిల్లలను దింపకూడదుట. ఇదంతా డబ్బులు దోచే ప్లాను కాకపోతే ఏంటిట? ఇన్ని ఆంక్షలున్న స్కూలు గురించి తెగ పొగుడుతున్నావేంటి?''

"నీలాగే నేనూ మొదట అనుమానపడ్డాను వదినా. పిజ్జా, బర్గర్‌లాంటి జంక్‌ఫుడ్, వేరు వేరు పదార్థాలు, టిఫిన్లు తెచ్చుకుంటే అవి వారి ఆరోగ్యానికి హానికరమే కాక పిల్లల మధ్య అంతరాలు పెంచుతాయని, స్కూలువారే వారి అధునాతన క్యాంటిన్‌లో మంచి పుష్టికరమైన తెలుగువంటకాలు చేయిస్తారు. రోజుకో రకమైన పిండి వంటలు, కూరలు, అందరికీ ఒకే విధమైన ఆహారం సమకూరుస్తారు. పిల్లలలో బేధభావం కలుగకుండా ఆరోగ్యకరమైన ఆహారంతో వారి మధ్య సామరస్యం పెంపొందించి వారి సర్వతోముఖమైన ఎదుగుదలకు తోడ్పడాలని వారి ఆశయం. ఇక నీళ్ల విషయానికొస్తే స్కూలోనూ, బస్సుల్లోనూ మినరల్ వాటర్ సౌకర్యం కల్పించారు. కార్లో వచ్చే కొందరి పిల్లల్లో సుపీరియారిటీ కాంప్లెక్స్, అలా రాలేని వాళ్లల్లో ఆత్మనూన్యతాభావం కలుగకుండా విద్యార్థులను ఓ క్రమపద్ధతిలో, మంచి విలువలతో తీర్చిదిద్దే ఉద్దేశ్యంతోనే నువ్వు చెప్పిన ఆంక్షలు విధించారు. ఫీజు కొన్ని వేలు ఎక్కువైనా అబ్బాయి భవిష్యత్తు బావుండాలని మేము స్కూలు మార్చాం.''

ఓ బర్త్‌డే పార్టీలో కలసిన వనజ, జలజల మధ్య జరిగిన సంభాషణ ఇది. వారి భర్తలు ఒకే ఆఫీసులో పని చేస్తారు. పార్టీలో ఆడవారి మధ్య నానిన నవీన యూనివర్శల్ స్కూల్ మర్నాడు వారి భర్తల మధ్య చర్చనీయాంశమైంది.

"మీవాడి కొత్త స్కూలు గురించి ఊదరగొట్టిందిట మా చెల్లాయి''

"వనజ గురించి నీకు తెలియందేముంది భానూ. పై పై మెరుగులు చూసి తెల్లనివన్నీ పాలనుకునేరకం. ఆ స్కూలు గురించి ఒక పార్శ్వమే ఆమెకు తెలుసు.''

"ఇంకో కోణం ఏమిటో?'' భానుమూర్తి అడిగాడు.

"అది మనవారి అమెరికా మోజును క్యాష్ చేసుకునే నైజం. ఆ స్కూలు ఎండీది మా మండలమే. పాతిక సంవత్సరాలు అమెరికాలో ఉండి కోట్లు గడించాడు. కొన్నాళ్లు ఉద్యోగం, కొన్నేళ్లు సిలికాన్ వ్యాలీలో ఓ సాఫ్ట్‌వేర్ కంపనీ వెలిగించాడు. అక్కడి సంపాదనతో ఇక్కడ పలుచోట్ల భూములు కొన్నాడు. అక్కడి మాంద్యం దెబ్బకు ఇక్కడికొచ్చి పడ్డాడు. ఎంతైనా అమెరికాలో వృద్ధి పొందిన బుర్ర కదా. మాంద్యం సెగ అంటని విద్యారంగాన్ని తన తొలిమెట్టుగా ఎంచుకున్నాడు. నిర్వహణ లోపంతో ఇబ్బందుల్లోపడ్డ ఓ రెడీమేడ్ స్కూలును చవకలో కొట్టేసాడు. దానికి మెరుగులు దిద్ది అమెరికాకే ప్రత్యేకమైన ప్రచారార్భాటంతో కొన్ని గిమ్మిక్కులు చేసి మాలాంటి వాళ్లని బుట్టలో వేసుకున్నాడు. నవీన ఎడ్యుకేషన్ ట్రస్టు అని పేరు పెట్టుకుని టాక్సులు ఎగ్గొట్టే పథకంతో దండిగా ఫీజులు దండుకుంటున్నాడు. వాటిలో చాలామట్టుకు నగదు రూపంలోనే అని చెప్పనవసరంలేదు. అతను ఎండి, అతని భార్య ప్రిన్సిపాల్, వాళ్లబ్బాయి కరస్పాండెంట్. అంతేకాదు, ట్రక్కుల ద్వారా పశువుల రవాణా చేసే అతని బామ్మర్దికి స్కూలు బస్సు నడిపే కాంట్రాక్టు, వంటలు చేసుకుని బ్రతికే అతని చిన్నాన్నగారి అబ్బాయికి స్కూలు క్యాంటిన్ నడిపే బాధ్యతలు అప్పగించాడు. ఇలా వారి వారి ఫ్యామిలీ ఎంటర్‌ప్రైస్‌ను


ధర్మాదాయ స్కూలుగా చలామణి చేస్తు న్నాడు'' నందన్‌రావు మాటల్లో వ్యంగ్యం.

"తెలిసీ మీరు దీంట్లో ఎందుకు పడ్డారు నందూ?''

"తెలిసీ కొన్ని తప్పులు చేయాల్సి వస్తుంది. ఇదీ అలాంటిదే. వనజకున్న అమెరికా పిచ్చి నీకు తెలుసుకదా. అమెరికా వెళ్లడానికి ప్రయత్నించ మని కొన్నాళ్లు నా వెంటపడింది. మంచి హోదా గల ప్రభుత్వోద్యోగం వదిలి నేనెక్కడికీ వెళ్లనని తేల్చి చెప్పేసరికి మిన్నకుంది. ఇప్పుడు అబ్బాయి ద్వారానైనా ఆ కోరిక తీర్చుకోవా లనే ఉబలాటం. అమెరికా నుంచి వచ్చి అక్కడి పద్ధతులతో నడిపే స్కూల్లో చేర్పిస్తే ఆ పద్ధతులు త్వరగా ఆకళింపు చేసుకుంటారనీ, వారు పెట్టబోయే ఇంజనీరింగ్ కాలేజీలో సునా యాసంగా అడ్మిషన్ పొందవచ్చుని, ఇలా చాలా దూరమే ఆలోచించింది వనజ. మనం ఆఫీ సులో బాసులమైనా గృహమంత్రికి దాసోహమ నక తప్పదు కదా. నాకు నచ్చిన స్కూల్లో కంటిన్యూ చేసి ఆ తరువాత రోజు వనజ పెట్టే నస భరించడడంకంటే ఈ స్కూల్లో కట్టే లక్షల్లోని ఫీజు చవకగా తేలుతుంది. అందుకని అస్త్రస న్యానం చేసాను.''

"మిగతా విషయాలు సరేగానీ అక్కడ టీచింగ్ ఎలా వుంటుందో?''

"మూడో తరగతి అబ్బాయి చదువు గమనించి వారి టీచింగ్ స్థాయి ఎలా తేల్చేది? ప్రతీదీ టైం ప్రకారం మెకానికల్‌గా



చేయడం, కృత్రిమంగా అరువు తెచ్చుకున్న అలవాట్లు, ఇవన్నీ నేను మా అబ్బాయిలో గమనించాను. ఏ మాటకామాటే చెప్పాలి. మిగతా స్కూళ్లల్లో వున్న వత్తిళ్లు లేవు.

రోజూ ఓ అరగంట జిమ్‌లో వ్యాయామం, యోగా, డ్రిల్, స్విమ్మింగ్ ఇవన్నీ ఉన్నాయి. అది కొంతలో కొంత మేలు. కానీ మన కుటుంబ వ్యవస్థకు పట్టుకొమ్మలైన అనురాగాలు, ఆప్యాయతలకే కరువు. అమెరికా విధానంలో చదివే పిల్లలు, ప్రతదీ వ్యాపార దృష్టితో చూస్తారేమో అని నా భయం.

ప్రస్తుతం మన దేశంలో స్కూలు, కాలేజీదాకానైనా తల్లిదండ్రులను గౌరవిస్తున్నారు. కానీ ఈ మేనేజ్‌మెంట్ పుణ్యమా అని చిన్నప్పటినుంచీ బంధువులను మనుషులుగా కాక వస్తువులుగా చూసే దృష్టి అలవడుతుందని నా ఊహ.''

''అలాంటప్పుడు వచ్చే సంవత్సరం మా అమ్మాయిని ఆ స్కూల్లో చేర్పించే విషయంలో బాగా ఆలోచించాలి. ఈ విషయంలో జలజ పట్టుదలగా ఉంది. ఈ పరిస్థితుల్లో నాకేం చేయాలో తోచడంలేదు. నీ సలహా ఏమిటి?''

''అది నువ్వు, జలజ తీసుకోవాల్సిన నిర్ణయం. మీ అమ్మాయి విషయం కాబట్టి ఇంకో విషయం చెబుతున్నాను. నవీన స్కూల్ ఎండీగారమ్మాయి అమెరికాలోనే పుట్టి ఆ సంస్కృతిలోనే పెరిగింది. స్కూల్ చదువు అయిందో లేదో ఓ అమెరికా అబ్బాయిని పెళ్లి చేసుకుంది. అబ్బాయిని వెంట బెట్టుకుని ఇంటికి వచ్చేదాకా తల్లిదండ్రులకు ఈ విషయం తెలీదు. అప్పుడు మింగలేక, కక్కలేక ఆశీర్వదించి కొంత డబ్బులిచ్చి సాగనంపారు. ఆర్నెల్లలోనే ప్రేమ ఇంకిపోయింది. డబ్బు కరిగిపోయింది. ఆకర్షణ కరిగిపోయింది. అబార్షన్ చేయించుకుని విడాకులు తీసుకుని ఆ అమ్మాయి ఓ నీగ్రో అబ్బాయిని కట్టుకుంది. అతని హింస భరించలేక మూన్నేళ్లల్లోనే మళ్లీ విడాకులు తీసుకుని ఇప్పుడు ఓ జర్మనీ యువకునితో సహజీవనం చేస్తోంది. ఇప్పుడు చెప్పు మనం మన పిల్లలకు అలా జరిగితే తట్టుకోగలమా? ఆ సంస్కృతి గురించి నాకు తెలిసింది, తోచింది చెప్పాను. నిర్ణయం మాత్రం మీరే తీసుకోవాలి'' నందన్‌రావు విపులీకరించాడు.

రావ్ మాటలకు మూర్తి బెదిరిపోయాడు.

అయినా ఏ మూలో అతనికి రావ్ వ్యాఖ్యలో అతిశయోక్తి ఉందనే భావన కలిగింది.

అనుమానం తప్ప వాస్తవికతకు ఆధారాలు లేవనిపించింది. అందుకే అన్నాడు.

''ఇంగ్లీషుకు దాసోహమనే ఈ రోజుల్లో మన భాషను నేర్పుతూ వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తూ కంప్యూటర్ విద్య ద్వారా ఆధునికతను అలవరుస్తూ మన సాంప్రదాయాన్ని పెంపొందిస్తూ బోధన చేసే స్కూలును పట్టుకుని కేవలం అది అమెరికా నుంచి వచ్చిన వారి ద్వారా నడుపబడుతోందన్న కారణంతో ఆడిపోసుకోవడం బావులేదు'' మూర్తి ప్రతిఘటించాడు.


''అందుకే నేనన్నాను, అమెరికావాళ్లు మార్కెటింగ్ గిమ్మిక్కులు చేయడంలో ఆరితేరారని. వాళ్లలో పస లేకపోయినా అందమైన అలంకరణలతో ఆకట్టుకుంటారు. పై పై మెరుగులు చూసి మోసపోవద్దు. నీవు స్వతంత్రంగా వాకబు చేసి నిర్ణయం తీసుకో'' నందన్‌రావు చేతులు దులిపేసుకున్నాడు.

రావ్ తన మనసులో నాటిన అనుమానబీజం తొలుస్తుండగా భారమైన మనసుతో ఇంటివైపు అడుగులు వేసాడు భానుమూర్తి.

జలజ మాటలకు పడిపోయిన వనజ, రావ్ మాటలతో ప్రభావితుడైన మూర్తిల మధ్య శీత యుద్ధం మొదలయింది.

మరుసటి సంవత్సరం వారి అమ్మాయిని నవీన యూనివర్శల్ స్కూల్లో చేర్పించిన తరువాత అది సమసిపోయిందని చెప్పక్కర్లేదుకదా!

★



## దంతావధానం - గుండెపోటు

నోరు శరీరానికి ముఖద్వారం వంటిది. నోరు, దంతాల పరిశుభ్రత మన ఆరోగ్యాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తుందని డాక్టర్లు, శాస్త్రజ్ఞులు ఎప్పుడో చెప్పారు. దీన్ని మరింతగా బలపరిచే సరికొత్త సమాచారం అందుబాటులోకి వచ్చింది. రోజుకు రెండుసార్లు దంతాలను శుభ్రపరచుకునేవారికన్నా దంతాలు పరిశుభ్రంగా లేని వ్యక్తుల్లో గుండెపోటు వచ్చే అవకాశాలు పెరుగుతాయని లండన్ విశ్వవిద్యాలయం కళాశాలలో జరిగిన అధ్యయనం చెబుతోంది. కాబట్టి రోజుకు రెండుసార్లు దంతాలనం పరిశుభ్రం చేసుకుంటే గుండెపోటు అవకాశాలు తగ్గిపోతాయని తెలుస్తోంది.

-డా.నమ్మోట

